## బతుకమ్మ వేడుకలు



మధురానగర్ సంక్షేమ సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ దేదీప్య తదితరులు
- పంజాగుట్ట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)



బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు
- అమీర్‌పేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి)



జెక్ కాలనీలో ఐకాన్ అపార్ట్‌మెంట్ వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు
- సనత్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయంలో జరిగిన ఆయుధ పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తదితరులు
- ఖైరతాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి)

## 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబురాలు




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో భాగంగా మన సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ఈనెల 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబురాలను నిర్వహిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బుధవారం ప్రజా సంబురాల నిర్వహణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేచర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, అడ్వెంచర్ తదితర కాంపిటీషన్స్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కేబీఆర్ పార్కుకు 9 గేట్లు ఉన్నాయని, ఒక్కో గేటు వద్ద ఒక్కో యాక్టివిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మున్ముందు ప్రజల సందడి ఉన్నచోట ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ హార్టీకల్చర్ ఆఫీసర్ సునంద, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

## 'కమలానగర్ వాసులకు 'డబుల్' ఇళ్లు కేటాయించండి'

యూసుఫ్‌గూడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ కమలానగర్ వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కార్పొరేటర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ కమలానగర్‌లో స్థానికుల స్థలాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారని తెలిపారు. నిర్మించిన ఇళ్లను కొందరికే కేటాయించారని, మరికొందరు లబ్ధిదారులు అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని, నిజమైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ విషయాన్ని మంత్రి వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్‌కు మంత్రి హామీ ఇచ్చారు.



మూలానక్షత్రం పురస్కరించుకొని సరస్వతి అలంకరణలో దర్శనమిచ్చిన జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి
- బంజారాహిల్స్ (ఆంధ్రజ్యోతి)



పంజాగుట్ట దుర్గానగర్‌లో అమ్మవారి మండపంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



ఖైరతాబాద్ బడా గణపతి ప్రాంగణంలో జరిగిన అమ్మవారి జాగరణలో కార్పొరేటర్ విజయారెడ్డితో నిర్వాహకులు
- ఖైరతాబాద్ (ఆంధ్రజ్యోతి)



## మధుమేహ బాధితులకు ఉచిత పరీక్షలు

**అమీర్‌పేట అస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో నెల రోజుల పాటు..**



సమావేశంలో డాక్టర్ జ్ఞానేశ్వర్ తదితరులు

అమీర్‌పేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితులకు కాళ్లు తొలగించాల్సిన అవసరం లేకుండా, ముందుగానే ఫుట్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకుంటే తగిన సమయంలో నయం చేయవచ్చునని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వాస్కులర్ సర్జరీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. నెల రోజుల పాటు 500 మంది మధుమేహ బాధితులకు ఆస్టర్ ప్రైమ్ ఆస్పపత్రిలో ఉచితంగా స్ర్కీనింగ్ పరిక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జ్ఞానేశ్వర్ వివరాలు వెల్లడించారు. ఉచిత సేవలను వినియోగించుకునేవారు 9010100536 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ డైరెక్టర్ ఎస్.సుష్మారాణి మాట్లాడుతూ సెప్టెంబరు 22 నుంచి నవంబరు 20వ తేదీ వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఇంకా అదనపు పరీక్షలు అవసరమైతే వాటిమీద 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఇప్పటికే కాళ్లలో కొంత ఇబ్బందులు ఉన్న వారు కూడా ఈ పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు సృజన్‌కుమార్, డాక్టర్ ఉదయ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, హాజరైన గర్భిణులు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ నీలిమ ఆస్పత్రిలో గర్భిణులకు బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో గర్భిణులు హాజరై వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా నీలిమ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమ శ్రీనివాస్ మాట్లాడుతూ నొప్పులు లేని ప్రసవ సదుపాయాన్ని కల్పించడానికి 24 గంటలు తమ డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. గర్భిణులకు చేయూతనందించడానికి ప్రతినెలా 9న నీలిమ - 9 పేరుతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రసవానికి ముందు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర విషయాలను గర్భిణులకు వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఉచితంగా భోజనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, అశోక్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ నాలా ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదు

- పరిశీలించిన జీహెచ్‌ఎంసీ అధికారులు

బంజారాహిల్స్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36 నాలా ఆక్రమణకు గురైందనే ఫిర్యాదుల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు విచారణ చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో కొన్నిచోట్ల నాలా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, మరికొన్ని ప్రాంతాల్లో నాలా కుంచించుకుపోయిందని హైడ్రాకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఇందులో వాస్తవాలు తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రా జీహెచ్‌ఎంసీని కోరింది. దీంతో ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు నంబరు 36లో పర్యటించారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వద్ద నాలా ఆక్రమణకు గురైనట్టు అధికారులు నిర్ధారించారు. అనంతరం నాలా వెడల్పును తగ్గిస్తూ వ్యాపార సముదాయాలు వెలిసినట్టు తేలింది. కొన్ని ప్రాంతాల్లో నాలా కనిపించకుండా పోయినట్టు అధికారులు గుర్తించారు. ఈ అంశాలపై అధికారులు నివేదిక రూపొందించి హైడ్రాకు అందించనున్నారు.

## పెండింగు డైట్ బిల్లులు విడుదల.. గురుకుల కాంట్రాక్టర్స్ హర్షం

పంజాగుట్ట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని సాంఘిక, ట్రైబల్, మైనారిటీ, వెనుకబడిన తరగతుల శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల విద్యాసంస్థలలో విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న డైట్ చార్జీలను విడుదల చేయడం పట్ల తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కృతజ్ఞతాభినందనల సభ నిర్వహించారు. పది నెలలుగా డైట్ బిల్లులు పెండింగులో ఉండడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్పందించి సుమారు రూ. 180కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల చేసినందుకు వారికి, సహకరించిన సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి అలుగు వర్షిణికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, ఆనంద్, సభ్యులు అశోక్, దుర్గప్రసాద్, అహ్మద్ ఫారూఖీ, ఎండీ అజీమ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలి

- 21న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు నిరసన ప్రదర్శన, ధర్నా

పంజాగుట్ట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలని నంగారా భేరి - లంబాడీ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్ చేశాయి. లేదంటే ఈనెల 21న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించనున్నట్టు ఆయా సంఘాల నాయకులు హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ధారావత్ గణేష్‌నాయక్, సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయక్ కలిసి ఈనెల 21న తలపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు నిరసన ప్రదర్శన, ధర్నా కార్యక్రమం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు శ్రీను నాయక్, పి.రమేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

బేగంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బేగంపేట ఎస్‌బీటీనగర్‌లో జనహిత సేవా ట్రస్టు, అప్సా స్వచ్ఛంద సంస్థ సంయుక్తాధ్వర్యంలో కిమ్స్ ఫౌండేషన్ సెంటర్ బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. మహిళలకు హిమోగ్లోబిన్‌తో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్టు ప్రతినిధులు ఎన్.శేఖర్ ముదిరాజ్, నసీమ్ భాను, ఆరిఫ్ పాల్గొన్నారు.



## కుమార్తె వరసైన బాలికపై లైంగిక వేధింపులు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వరసకు కుమార్తె అయిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు ఓ వ్యక్తి. రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు ఇద్దరు పిల్లలు. భర్తతో మనస్పర్ధలు రావడంతో విడిపోయారు. ఆమె తన పిల్లలను అన్న వద్ద ఉంచింది. ఆ మహిళకు ఓ వ్యక్తి పరిచయం కావడంతో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు పుట్టాడు. భర్త ఒత్తిడి మేరకు ఆమె తన అన్న వద్ద ఉన్న కుమార్తెను ఇంటికి తీసుకొచ్చింది. ఆమె భర్త ఉద్యోగం చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆ మహిళ ఉద్యోగం చేస్తూ ఇల్లు గడుపుతోంది. ఇదే అదునుగా భావించిన అతడు తొమ్మిదేళ్ల వయస్సుగల బాలికను లైంగికంగా వేధిస్తున్నాడు. విషయం మీ అమ్మకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. భర్త ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఆ మహిళ తన కుమార్తెను అడగగా.. వేధిస్తున్నట్లు చెప్పింది. దీంతో ఆమె కుమార్తెను హాస్టల్‌కు పంపించడంతో అతడు ఇంట్లో ఉన్న టీవీ, ల్యాప్‌టాప్ తదితర విలువైన వస్తువులను తీసుకుని వెళ్లిపోయాడు. భర్తపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## అక్రమంగా నిల్వ చేసిన రేషన్‌బియ్యం పట్టివేత

యూసుఫ్‌గూడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని మధురానగర్ పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు రహ్మత్‌నగర్ హనుమాన్ దేవాలయం సమీపంలో కృష్ణ అనే వ్యక్తి ఇంట్లో పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. ఆ ఇంట్లో 50 కేజీల 25 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించి సీజ్ చేశారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నాడు.

## మానసిక ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో వీరబాబు అనే వ్యక్తి అతని అక్క మణి, అన్న శ్రీనివాస్‌తో కలిసి ఉంటున్నాడు. వీరికి భార్యా, భర్తలు, పిల్లలు ఎవరూ లేరు. వీరబాబు గతంలో ఓ ప్రైవేట్ చానల్‌లో విలేకర్‌గా పని చేశారు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి తట్టుకోలేక వీరబాబు బుధవారం తెల్లవారుజామున తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదం సంతోష్‌కుమార్, ఉమాదేవీ తదితరులు


బౌద్ధనగర్‌లో దుర్గామాత మండపంలో పూజలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ తదితరులు


రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ


మధురానగర్‌కాలనీ బంగారుమైసమ్మ ఆలయంలో చండీహోమంలో పవన్‌కుమార్‌గౌడ్ దంపతులు


బోయినపల్లి ముస్లిం బోర్డు అధ్యక్షుడు రెహమాన్ షరీఫ్, ఉపాధ్యక్షుడు అతావుల్లా షరీఫ్‌ను సత్కరిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్ - (సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి)

# ఘనంగా దేవీ నవరాత్రోత్సవాలు

బౌద్ధనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలో దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బౌద్ధనగర్ కనకదుర్గా ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయచైర్మన్ కొట్ల ధరణీధర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకులు శ్రీనివాసపంతులు, సాయిపంతులు ఆధ్వర్యంలో కుంకుమార్చన, సరస్వతి పూజలను నిర్వహించారు. చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో ఆలయచైర్మన్ గుంటికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవీ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి


సరస్వతిదేవీ అలంకరణలో బౌద్ధనగర్ కనకదుర్గ అమ్మవారు

మహేందర్‌గౌడ్ వారిని సత్కరించారు. కార్యక్రమంలో జలంధర్‌రెడ్డి, అమర్‌నాథ్‌గౌడ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మేడిబావి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జరిగిన వేడుకల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ పూజలు చేశారు. బౌద్ధనగర్, ఇందిరానగర్‌కాలనీలోని మండపాల్లో బీజేపీ మహాకాళీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ పూజలను నిర్వహించారు. మధురానగర్‌కాలనీ బంగారు మైసమ్మ ఆలయంలో నిర్వహించిన చండీ


ఇందిరానగర్‌కాలనీలో దుర్గామాత మండపంలో పూజలు చేస్తున్న మేకల సారంగపాణి, రవిప్రసాద్‌గౌడ్ తదితరులు

హోమం లో ఆలయచైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాదం బాలరాజ్‌యాదవ్, మిట్టపల్లి బాబురావు, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు. మేడిబావి ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ చైర్మన్ పరికబండి కళాప్రకాశ్ ఆధ్వర్యంలో సరస్వతి పూజలను నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు


రాంగోపాల్‌పేట కుమ్మరిబస్తీలో దుర్గామాత మండపం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

మారేడుపల్లి/బోయిన్‌పల్లి/రాంగోపాల్‌పేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి, బోయినపల్లి, రాంగోపాల్‌పేట డివిజన్లలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రాంగోపాల్‌పేట డివిజన్ కుమ్మరిబస్తీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, కొశికె కిరణ్మయి, మల్లికార్జున్‌గౌడ్, ఉజ్జయినీ మహాకాళి దేవాస్థాన మాజీ ధర్మకర్తలు పాటిల్ ఆనంద్, కొశికె కిషోర్ కుమార్ తదితరులు ఉన్నారు. పికెట్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీభూలక్ష్మీ అమ్మదేవి ఆలయంలో బుధవారం సరస్వతి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు జెట్టి ఉమేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద టింకు గౌడ్ ఆధ్వర్యంలో


బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దంపతులు

ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆయన సతీమణి మమతారెడ్డితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బోయిన్‌పల్లిలోని మూవీ స్పాట్ వద్ద కాంగ్రెస్ నాయకుడు, కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన


బోయిన్‌పల్లి మూవీస్పాట్ వద్ద దాండియా వేడుకలను ప్రారంభిస్తున్న జంపన్న ప్రతాప్, ముప్పిడి మధుకర్, బద్దం బల్వంత్‌రెడ్డి

వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, బద్దం బల్వంత్‌రెడ్డి, ఆనంద్‌బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాండియా నృత్యాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మెట్టు సిరాజ్, ఫుట్‌బాల్ క్రీడాకారుడు సతీష్, చిట్టిబాబు, భారతి తదితరులు పాల్గొన్నారు.

### ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో..

సికింద్రాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నగర ప్రజలతోపాటు శివారు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణాశ్రీనివాస్‌గౌడ్ తన మనుమడు ముళ్ల సిద్దార్థ చేతుల మీదుగా భక్తులకు పుస్తకాలు పంపిణీ చేయించారు. గురువారం శీదుర్గాదేవిగా, శుక్రవారం శ్రీమహిషాసుర మర్దినీదేవిగా అమ్మవారి దర్శనం ఉంటుందని ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు.


ఆలయంలో మనువడితో పుస్తకాలు పంపిణీ చేయిస్తున్న మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణాశ్రీనివాస్‌గౌడ్

## నేటి నుంచి మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాలు

తార్నాక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాలను ఈ నెల 9వ తేదీ గురువారం నుంచి 12వ తేదీ వరకు సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మహనీయులు కాన్షీరాం, ములాయంసింగ్ యాదవ్, డా. రామ్‌మనోహర్ లోహియ, జయప్రకాష్ నారాయణ జయంతి, వర్ధంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి తెలిపారు. మహనీయుల వర్ధంతి కార్యక్రమంలో భాగంగా బుధవారం తార్నాకలోని పార్టీ కార్యాలయంలో సమాజ్‌వాది పార్టీ నాయకులు, కార్యకర్తలు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. ఈ సందర్భంగా ప్రొ. సింహాద్రి మాట్లాడుతూ సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల విముక్తి కోసం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ నాయకులు మహమ్మద్ వజీద్, రిజ్వాన్, శ్రీహరి ముదిరాజ్, బాలుయాదవ్ పాల్గొన్నారు.

## 'గంజాయి నివారణకు బస్తీల్లో పోలీస్ గస్తీని పెంచాలి'

అడ్డగుట్ట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకు గంజాయి సరఫరా, విక్రయాలు పెరుగుతున్నాయని, వాటిని నివారించడానికి బస్తీలలో పోలీస్ గస్తీని పెంచాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ బుధవారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడిన యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. అర్ధరాత్రి వేళల్లో బస్తీలు, కాలనీలలో నిరంతరం పోలీస్‌లు పెట్రోలింగ్ చేయాలని, బస్తీల్లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐని కోరినట్లు తెలిపారు. సీఐని కలిసిన వారిలో సీహెచ్ లక్ష్మీనారాయణ, బక్కూరి నర్సింగ్‌రావు, సువర్ణ, గౌరి నాగరాజు, భాగ్య, లావణ్య పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు 2లో ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడని గమనించిన ప్రయాణికులు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు వయస్సు దాదాపు 45 ఏళ్లు ఉండవచ్చని, ఆచూకీ తెలిసిన వారు 94400 83160 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని కానిస్టేబుల్ తెలిపారు.

## 'సహస్రఫణా'కు సరైన ఆదరణ రాలేదు: ప్రభావతిదేవి

చిలకలగూడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు నవల వేయిపడగలు పుస్తకాన్ని 'సహస్రఫణా' పేరుతో సంస్కృతంలోకి అనువాదం చేస్తే సరైన గుర్తింపు, ఆదరణ రాలేదని ప్రొఫెసర్ అయ్యగారి ప్రభావతిదేవి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని మహబూబ్ కాలేజీలో సంస్కృత లెక్చరర్‌గా విధులు నిర్వహించిన ఆమె, ఎంఫిల్ పూర్తిచేసి అమెరికాలోని డల్లాస్ యూనివర్సిటీలో ప్రస్తుతం సంస్కృత ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆమె బుధవారం మెట్టుగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1934వ సంవత్సరంలో విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగల నవల రచించిరాని గుర్తుచేశారు. సాహితీవేత్త ఏలూరిపాటి అనంతరామయ్య ప్రోత్సాహంతో 2001లో, 6నెలల్లో వేయిపడగల నవలను సంస్కృతంలోకి అనువదించానని తెలిపారు.


మాట్లాడుతున్న ప్రభావతిదేవి

వివిధ కారాణాల వల్ల దానిని సంస్కృతంలో ముద్రించడానికి 10 ఏళ్లు పట్టిందన్నారు. దాదాపు రూ.3 లక్షల సొంత డబ్బుతో పుస్తకం ముద్రించి, 2010, అక్టోబర్ 25న అప్పటి సీఎం కొణిజేటి రోశయ్యతో అవిష్కరింపజేశానని అన్నారు. నవల అనువాదం ప్రారంభించగానే మహిళకి గుర్తింపు రాకూడదని, బెదిరింపులు వచ్చాయన్నారు. అయినా నవలని ముద్రించానన్నారు. విశ్వవిద్యాలయాలు, సాహితీవేత్తలు, నుంచి ఆదరణ, గౌరవం, పురస్కారాలు లభించలేదని, ఈ పుస్తక త్యాగం చేస్తున్నానని అన్నారు. పుస్తక త్యాగం అంటే ఏమిటని విలేకరులు అడిగిన ప్రశ్నకి జవాబిస్తు నా సహస్రఫణా అనువాదంతో వున్న జ్ఞాపకాలను చెరిపి వేస్తున్నానని ఏవరైనా ఈ పుస్తకాన్ని వారికి నచ్చిన విధంగా వినియోగించుకోవచ్చునని, దానిపై తనకున్న సర్వహక్కులు వదిలి వేసుకుంటున్నాని తెలిపారు.

## నిర్దిష్ట లక్ష్యంతో సిబ్బంది విధులు నిర్వహించాలి

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట లక్ష్యంతో సిబ్బంది విధులు నిర్వహించాలని నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వి.శ్రీనివాస్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత 4.0 ప్రత్యేక ప్రచారంలో భాగంగా బుధవారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ప్రధాన తపాల కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయం ప్రాంగణంలో ఆయన మొక్కను నాటారు. అనంతరం రోజు వారి పెండింగ్ ఉన్న పనుల భారం ఎలా తగ్గించుకోవాలి, పోస్టల్ నెట్‌వర్క్ విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సాంకేతికతను వినియోగించుకుని పోస్ట్‌మన్‌లు మొబైల్ అప్లికేషన్, తపాల డిజిటల్


మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి శ్రీనివాస్

చెల్లింపులు వంటి సేవలను ప్రజలకు అందించడంలో తపాలశాఖ ముందుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఎస్‌బీ జనరల్ సుమితా అయోధ్య, డీపీఎస్‌బీ ఆర్ముగం, సికింద్రాబాద్ పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ ఆఫీసెస్ ఏ.సుబ్రహ్మణ్యం, సీనియర్ పోస్ట్ మాస్టర్ జి.నర్మద, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆటో, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి'

తార్నాక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమానికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆటో కార్మికట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెర్ల రవి డిమాండ్ చేశారు. బుధవారం తార్నాకలో ఆటో, రవాణారంగ కార్మికులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా పల్లెర్ల రవి మాట్లాడుతూ ఆటో, రవాణారంగ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో అనుమతులను రాష్ట్రం ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్‌లకు ఈఎస్ఐ సదుపాయం కల్పించి, డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలన్నారు. 50 ఏళ్లు నిండిన డ్రైవర్లకు పింఛను సౌకర్యం కల్పించాలన్నారు.

## 'మాకు జీతాలు ఇప్పించండి మేడం'

అడ్డగుట్ట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. దసరా పండుగ వస్తుంది. మాకు జీతాలు ఇప్పించండి మేడం' అని గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజాకుమారిని వేడుకున్నారు. బుధవారం ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌ను కలిసిన 80 పారిశుధ్య సిబ్బంది తమ బాధను వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి జీతాలు ఇచ్చేలా చూస్తానని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు.

## భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు

బౌద్ధనగర్/అడ్డగుట్ట/ సనత్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ ఎస్ఎంఆర్ కాంప్లెక్స్ వద్ద బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కందినారాయణ, గడప శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌ల కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. మారేడుపల్లి సెట్విన్ కేంద్రంలో సిబ్బంది, విద్యార్థులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. సనత్‌నగర్‌లోని జెక్ కాలనీలో ఐకాన్ అపార్ట్‌మెంట్ వద్ద నిర్వహించిన వేడుకల్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అధ్యక్షుడు ప్రసాద్, సుబ్బరాజు, విశ్వనాథరాజు, అపార్ట్‌మెంట్లలోని మహిళలు పాల్గొన్నారు.



ప్రముఖ సినిమా దర్శకుడు వి.వి.వినాయక్ జన్మదిన వేడుకలు బుధవారం నందిహిల్స్‌లోని ఆయన నివాసంలో జరిగాయి. హీరోలు చిరంజీవి, ప్రభాస్, రామచరణ్ .. వినాయక్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. - బౌద్ధనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)